క్లుప్తంగా

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

నారాయణవనం: పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నామని, ఈ కారణంగా మధ్యాహ్నం 1.30 గంటల తరువాత భక్తులను స్వామి దర్శనానికి అనుమతిస్తామని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ. ఈనెల 31 నుంచి జూన్ 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు.

ఆధార్ శిబిరానికి స్పందన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గ్రామ సచివాలయాల్లో మంగళవారం నిర్వహించిన ఆధార్ మెగా శిబిరానికి మంచి స్పందన లభించిందని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. మొదటిసారి బయోమెట్రిక్ చేసుకున్న ఐదేళ్ల లోపు పిల్లలకు ఉచితంగా ఆధార్ చేశారు. ఆధార్ ఫోన్ నంబరు లింకు, పేరు తప్పుల సవరణ, చిరునామా మార్పు, పుట్టిన తేది తప్పులను సవరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఏర్పేడు: మండలంలోని అముడూరు పంచాయతీలోని బండివానిపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణలో యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు మొక్కలు నాటారు. చెట్లతో కలిగే ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

కరెంటు బిల్లుల చెల్లింపు కేంద్రం మార్పు

పిచ్చాటూరు: స్థానిక బస్టాండు ఆవరణలో ఉన్న కరెంటు బిల్లుల చెల్లింపు కేంద్రాన్ని తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు మార్పు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ రవి తెలిపారు. ఇక నుంచి అక్కడే కరెంటు బిల్లులు చెల్లించాలని కోరారు.

అన్నదానానికి విరాళం



చైర్మన్‌కు అన్నదానం విరాళమిస్తున్న అహిష్ రెడ్డి కుటుంబ సభ్యులు

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి మంగళవారం నెల్లూరుకు చెందిన అహిష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి రూ.లక్ష విరాళాన్ని దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేవారు. స్వామి అమ్మవారి దర్శనాంతరం ఆలయ అధికారులు వారికి స్వామి, అమ్మవార్ల చిత్రపటం , తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పిచ్చాటూరు: బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన ఎంఎస్ కంటి ఆసుపత్రి నిపుణులు పరీక్షలు చేస్తారన్నారు. అవసరాన్ని బట్టి కంటి అద్దాలు ఇస్తారని, ఆపరేషన్ ఉచితంగా చేస్తారని చెప్పారు. ఈ శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సోమనాథేశ్వరాలయంలో ఎంపీపీ పూజలు



సోమనాథేశ్వర ఆలయంలో ఎంపీపీ రేఖకు అలయ మర్యాదలు చేస్తున్న ధర్మకర్త

పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజుకండ్రిగ సోమనాథేశ్వరాలయంలో ఎంపీపీ హెచ్.రేఖ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీతోపాటు సింగిల్ విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, సర్పంచ్ భూపతి, వైఎస్ఆర్‌సీపీ రైతు విభాగ మండల అధ్యక్షుడు, ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షుడు మునిరాజుకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. ధర్మకర్త జ్యోతిరాజు వారికి ఆలయ మర్యాదలు చేశారు.

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు

• ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



నాగలాపురం వినోభానగర్‌లో లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం మధ్యాహ్నం నాగలాపురం సచివాలయం–3 పరిధిలోని వినోభానగర్, దళితవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ఆయా కుటుంబాలకు బుక్‌లెట్లతో తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు దిక్కుతోచని స్థితిలో వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

జాతీయ రహదారి నుంచి తమ గ్రామం వరకు తారురోడ్డు వేయించాలని, కొన్ని వీధులకు సిమెంటు రోడ్డు వేయించాలని, మరికొందరు ఇళ్ల స్థలాలు, జగనన్న ఇల్లు, పెన్షన్ మంజూరు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. రోడ్డు నిర్మాణానికి రూ.72 లక్షలు నిధులు మంజూరై, టెండర్లు సైతం పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అలాగే సచివాలయానికి మంజూరయ్యే రూ.20 లక్షలతో సీసీ రోడ్లు వేయడానికి ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీఓ పద్మజ, ప్రజాప్రతినిధులకు సూచించారు. అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలని ఆదేశించారు.

వైఎస్ఆర్‌సీపీ 4 ఏళ్ల పాలన సంబరాలు



నాగలాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటై మంగళవారానికి 4 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో నాగలాపురంలోని వైఎస్ఆర్ విగ్రహం ఎదుట ఎమ్మెల్యే ఆదిమూలం, పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలి, ఏఎంసీ డైరెక్టర్లు కులశేఖర్ రెడ్డి, అలగేశన్, ట్రేడ్ యూనియన్ చైర్మన్ ఎస్ఎం సురేష్, శ్రీపల్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, నాయకులు మహేష్ రెడ్డి, శ్యామ్, పాల్ పద్మనాభం, ఉదయకుమార్, డానియేల్, మురళి, దేశన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రగతి సంస్థ సభ్యులు



బడిఈడు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జయలక్ష్మి

తొట్టంబేడు (రేణిగుంట): ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య అందుతోందని, ప్రైవేటు పాఠశాలల కన్నా మెరుగైన సౌకర్యాలు ప్రభుత్వం కల్పించిందని ప్రగతి మండల కో–ఆర్డినేటర్ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లె యానాది కాలనీలో బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను సంస్థ ప్రతినిధులు కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పాలని కోరారు. నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న వసతి దీవెన..మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. వీటిని సద్వినియోగం చేసుకుని పిల్లల భవితకు బాటలు వేయాలని కోరారు. గ్రామ సర్పంచ్ వనమ్మ మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, తల్లిదండ్రుల కమిటీ సభ్యురాలు శివమ్మ, సచివాలయ సిబ్బంది అరుణ, మహేశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది పోలమ్మ, ప్రగతి సిబ్బంది రామచంద్ర పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పండి

రేణిగుంట: బడిఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పాలని ప్రగతి సంస్థ మండల కన్వీనర్ జయలక్ష్మి కోరారు. మంగళవారం మండలంలోని వెదుళ్లచెరువు, మామండూరు, చైతన్యపురం గ్రామాల్లో బడిఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని, ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థల కంటే మిన్నగా ఉన్నాయని పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ స్కూళ్లలో వసతులు, విద్యార్థులకు ప్రయోజనాలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా సొమ్ము పంపిణీ



మృతుడి భార్యకు బీమా నగదును ఇస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు విష్ణుప్రియ

పిచ్చాటూరు: మృతుడి కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం కింద మంగళవారం తక్షణ సాయంగా రూ.10 వేలను జెడ్పీటీసీ సభ్యురాలు విష్ణుప్రియ అందజేశారు. అడవి కొడియంబేడు ఎస్టీ కాలనీలో నాలుగు రోజుల క్రితం రమేష్(47) అనారోగ్యంతో మరణించాడు. ఈ నేపథ్యంలో మృతుని భార్య సుధకు బీమా సొమ్మును అందజేసి ఓదార్చారు. మిగిలిన రూ.90 వేలను త్వరగా వచ్చేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, వెల్ఫేర్ అసిస్టెంట్ దీపికను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మునివేలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్ఈ కృష్ణారెడ్డి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి వద్ద పామోలిన్ ట్యాంకర్ ఢీకొన్న 33 కేవీ లైన్ ప్రాంతాన్ని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ప్రమాదానికి కారణాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 33 కేవీ లైన్ ఏర్పాటుకు అయ్యే ఖర్చును అంచనా వేయాలని, బుధవారం నుంచి పనులు ప్రారంభించాలని ఎస్పీడీసీఎల్ డీఈ వాసురెడ్డికి సూచించారు. గ్రామాల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ముంబై హైకోర్టు న్యాయమూర్తి సందీప్ కుమార్ సి.మోరే



తిరుపతి జిల్లా న్యాయమూర్తి గురునాథ్ కుటుంబ సభ్యులు

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవారిని మంగళవారం ముంబై హైకోర్టు న్యాయమూర్తి జె.సందీప్ కుమార్ సి.మోరే, తిరుపతి జిల్లా న్యాయమూర్తి ఎం.గురునాథ్ తమ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ సతీష్ మాలిక్ స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి,అమ్మవారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

‘ఉపాధి’లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్



హాజరైన సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంలో నిధుల వినియోగంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని, షోకాజు నోటీసులు జారీ చేసి రికవరీ చేస్తామని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ అవరణలో ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఫారెస్ట్, వెటర్నరీ, స్కూల్ ఎడ్యుకేషన్, వెలుగు, సెర్ప్ శాఖల ద్వారా ఉపాధి నిధులతో పనులను చేసినట్లు తెలిపారు. 2022–2023 ఆర్థిక సంవత్సరంలో 956 పనులకు రూ.7,55,81,364 వ్యయం చేయగా, ఈ నగదు సక్రమంగా ఖర్చు చేశారా, లేదా? అని వారం పాటు మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో 13 మంది డీఆర్‌పీలు పనులను పరిశీలించారన్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగినట్టు తేలడంతో రూ.30,860 రికవరీకి ఆదేశించామన్నారు. అలాగే 500 వందలకు పైగా మొక్కలు చనిపోయాయని, కొన్ని గ్రామాల్లో కూలీలు చెరువుల్లో తవ్విన గుంతల కొలతలు తేడా ఉండడంతో వాటిని సరిచేయాలన్నారు. అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు మాట్లాడుతూ, వేసవి కాలంలో కూలీలకు వ్యవసాయ పనులు ఉండవని, దీనిని దృష్టిలో ఉంచుకుని వారికి పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ త్రివిక్రమ్ రావు, ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఏపీఓ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల సేవలు ప్రశంసనీయం

• మేయర్ శిరీష, కమిషనర్ హరిత
• జాతర విజయవంతానికి సహకరించిన వారికి ప్రశంసా పత్రాలు



మహిళా పోలీసుకు సర్టిఫికెట్ అందజేస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి తుడా: అత్యంత వైభవోపేతంగా నిర్వహించిన తిరుపతి గంగమ్మ జాతర ఉత్సవాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శుల సేవలు ప్రశంసనీయమని తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత అన్నారు. గంగమ్మ జాతరలో విధులు నిర్వహించిన మహిళా సంరక్షణ కార్యదర్శులకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. వార్డు సచివాలయాల్లోని మహిళా సంరక్షణ కార్యదర్శులు 61 మందికి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణలతో కలిసి ప్రశంసాపత్రాలను ఇచ్చారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా పోలీసులు తమకు కేటాయించిన విధులను చక్కగా నిర్వహించారని కొనియాడారు. ఆలయ పరిసరాల్లో సేవలందించడం మొదలుకొని కళా బృందాలు, ప్రజలను సమన్వయం చేసుకుని గంగ జాతర విజయానికి దోహదపడ్డారన్నారు. గంగమ్మ రాష్ట్ర పండుగగా ప్రకటించిన మొదటి జాతరను ఇంటింటికీ తీసుకెళ్లడమే కాకుండా, ప్రజల నరనరాల్లోకి ఎక్కించేలా జాతరను అద్భుతంగా జరిపించేలా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆలోచన, తపనను అధికారులు, సిబ్బంది ఆచరించి విజయవంతం చేశారన్నారు. సెట్విన్ ఆధ్వర్యంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కళా బృందాలు నగరంలో అన్ని వైపులా తిరుగుతూ ప్రజలను జాతర వైపు మళ్లించడం జరిగిందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ తరుపున గంగజాతరకు కావాల్సిన శానిటేషన్, నీటి సౌకర్యం, వంటివి కల్పించామన్నారు. సెట్విన్ సీఈఓ మురళీ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.కె.బాబు, తమ్ముడు గణేష్, కార్పొరేటర్ నరేంద్రనాథ్, అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ పి.రవి పాల్గొన్నారు.

వేడుకగా గరిగె ఉత్సవం



గెరిగ ఉత్సవంలో దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తిలో పిచ్చాటూరు రోడ్డు సమీపంలోని బంగారమ్మ కాలనీ వద్ద శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం అనుబంధ బంగారమ్మ దేవాలయం జాతర సందర్భంగా మంగళవారం గెరిగ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ, బంగారమ్మ జాతర పురస్కరించుకుని ఈ ఉత్సవాన్ని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏఈఓ లోకేష్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీహరి, సబ్ టెంపుల్స్ ఇన్‌చార్జ్ లక్ష్మయ్య, దేవస్థాన సిబ్బంది మునిరాజు, పట్టణ ప్రముఖులు భాస్కర్ రెడ్డి, జగన్నాథం నాయుడు, రాజగోపాల్ రెడ్డి, రామాంజనేయులు, ఆలయ పూజారి శ్రీనివాసులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బంగారమ్మకు సారె

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరఫున బంగారమ్మకు ఆడబిడ్డ సాంగ్యంగా బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి దంపతులు అమ్మవారికి సారె సమర్పిస్తారని అంజూరు తెలియజేశారు. ఆ తర్వాత జాతర ప్రారంభమవుతుందని చెప్పారు. పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, పట్టణ ప్రజలు పాల్గొనాలని కోరారు.

వైభవంగా పర్వతాల గంగమ్మ జాతర



అమ్మవారికి సారె సమర్పిస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

రేణిగుంట: మండలంలో కరకంబాడి సచివాలయ పరిధిలోని తారకరామానగర్‌లో మంగళవారం వైభవంగా పర్వతాల గంగమ్మ జాతర నిర్వహించారు. రెండు రోజుల పాటు అమ్మవారికి విశేష పూజలు చేశారు. బియ్యపు ఆకర్ష్‌రెడ్డి అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయంలో అర్చనలు, పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

స్కూళ్లకు ‘జగనన్న గోరుముద్ద’ గ్లాసులు



ప్రధానోపాధ్యాయులకు స్టీలు గ్లాసులు అందజేస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: జగనన్న గోరుముద్ద పథకం కింద మండలంలోని 67 పాఠశాలలకు 4,213 స్టీల్ గ్లాసులు అందాయని ఎంఈఓ కే. రవి తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్టీలు గ్లాసులను అందజేశారు. గ్లాసులపై జగనన్న గోరుముద్ద అని కూడా ముద్రించారన్నారు. వీటిని పాఠశాలల పునఃప్రారంభం రోజు విద్యార్థులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భారతి, త్యాగరాజులు, కోటీశ్వరం, కుప్పయ్య, గౌరీశంకర్, మునికళ్యాణి, శైలజ, చెంగమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణ కుమార్

సత్యవేడు: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ రమణ కుమార్ కోరారు. మంగళవారం తన కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలకు సంబంధించి పంచాయతీలకు 126 పనులకు రూ.2.40 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇప్పటివరకు 114 పనులు ప్రారంభించారని, 12 ప్రారంభించాల్సి ఉందని, వంద శాతం పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు చొరవ చూపాలని ఆదేశించారు. పనులు పూర్తి చేసిన వారికి త్వరితగతిన బిల్లులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శివయ్య రెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం



సన్మానం అందుకున్న వలంటీర్లతో జెడ్పీటీసీ సభ్యుడు వెంకట సుబ్బారెడ్డి తదితరులు

రేణిగుంట: వలంటీర్ల సేవలు అమోఘమని జెడ్పీటీసీ కాపిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఊరందూరు, వేడాం, అమ్మపాలెం, టీఎంవీకండ్రిగ, నారాయణపురం సచివాలయాల పరిధిలోని 72 మంది వలంటీర్లను సన్మానించారు. వలంటీర్లు కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో వారందించిన సేవలు హర్షణీయమన్నారు.

న్యాయం చేయాలని విజ్ఞప్తి



మాట్లాడుతున్న బాధితురాలు సుశీల

తిరుపతి కల్చరల్: పిత్రార్జితంగా తమకు సంక్రమించిన భూమిని తన బాబాయ్ ఆక్రమంగా కాజేస్తున్నారని, అధికారులు స్పందించి తమ భూమిని ఇప్పించి న్యాయం చేయాలని దుర్గిపేరి గ్రామానికి చెందిన సుశీల విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏర్పేడు మండలం దుర్గిపేరి గ్రామంలో తమ ఉమ్మడి కుటుంబానికి 20 సెంట్ల భూమి ఉందని తెలిపారు. తమకు తమ బాబాయ్ సింగం సుగ్రీవరెడ్డికి పది సెంట్లు చొప్పున రావాల్సి ఉందన్నారు. అయితే తమ భూమిపై కన్నేసిన బాబాయ్ సదరు భూమిని తనకు విక్రయించాలని కోరారని తెలిపారు. తాము నిరాకరించడంతో స్థానిక సర్పంచ్ మునిరామిరెడ్డి సహాయంతో దొంగ డాక్యుమెంటు సృష్టించి కాజేశారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు.

వాడవాడలా చెంగాళమ్మకు అంబలి



పరమేశ్వరి నగర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

సూళ్లూరుపేట: పట్టణంలోని వాడవాడలా చెంగాళమ్మకు అంబలి పోసే కార్యక్రమాన్ని సంబరంలా నిర్వహిస్తున్నారు. మంగళవారం పట్టణంలోని పరమేశ్వరినగర్, గాండ్లవీధి, బాపూజీకాలనీ, కస్పారెడ్డిపాళెం ప్రాంతాల్లో చెంగాళమ్మకు అంబలి పోసి, పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అంబలితో ఊరేగింపుగా నాలుగురోడ్ల కూడళ్ల వరకు వెళ్లి, అక్కడ అమ్మవారికి పూజలు చేసి, అంబలి పోశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పాల్గొని పూజలు చేసి అందరికీ అంబలిని పంపిణీ చేశారు. మంగళవారంతో అంబలి పోసే కార్యక్రమం ముగిసింది. ఈనెల 26న శుక్రవారం అమ్మవారి బ్రహ్మోత్సవాలకు మొదటి చాటింపు వేయనున్నారు.